మహిమాన్వితుడు మద్దుండాల మల్లేశ్వరుడు

- ప్రకృతి సోయగాల మధ్య సెలయేటి ఒడ్డున కొలువైన మల్లేశ్వరుడు
- ఝరిస్నానాలు ఆచరిస్తే శుభం కల్గుతుందని విశ్వాసం
- మహాశివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైన మల్లేశ్వరస్వామి ఆలయం



మద్దుండాల మల్లేశ్వరస్వామి ఆలయం



మల్లేశ్వరస్వామి

పీలేరురూరల్ : మండలంలోని తలపుల పంచాయతీ అడవిపల్లె సమీపంలో వెలసిన శ్రీ మద్దుండాల మల్లేశ్వరస్వామి భక్తుల వరప్రదాతగా ప్రసిద్ధి చెందారు. ఆహ్లాదకర వాతావరణంలో ప్రకృతి సోయగాల మధ్య గలగల పారే సెలయేటి ఒడ్డు శ్రీ మద్దుండాల మల్లేశ్వరస్వామి స్వామి వెలిశారు. అడవిపల్లె సమీపంలో అటవీ ప్రాంతం మధ్యలో లోయ ప్రాంతం ఒడ్డున మల్లేశ్వరస్వామి కొలువై మహాశివరాత్రి ఉత్సవాలకు సిద్ధమయ్యారు. ప్రతి యేటా ఇక్కడ మహాశివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఝరిస్నానాలకు ఆచరిస్తే ఆ కుటుంబానికి శుభం కలుగుతుందని భక్తుల్లో ప్రగాఢ విశ్వాసం ఉంది. సుమారు 300 సంవత్సరాలు చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని విజయనగర సామంతులు ఇక్కడి పాలేగాళ్ల సహకారంతో నిర్మించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. మద్దుండాల మల్లేశ్వరస్వామి ఆలయం గురించి, ఆ పేరు రావడానికి గల కారణాలు భక్తులు కథలుగా చెబుతారు. స్థానికుల కథనం మేరకు .. గంగాదేవి ఓ శుభకార్యానికి వెళ్లడానికి పార్వతీదేవి నుంచి ఆభరణాలు అరవుకు తీసుకుంటుంది. ఆ ఆభరణాలు తిరిగి పార్వతీ దేవికి ఇవ్వడానికి ఆలస్యం అవుతుంది. దీంతో పార్వతీ దేవి కోపోద్రిక్తురాలై గంగాదేవిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మందలిస్తుంది. గంగాదేవి తీవ్ర అవమానానికి గురై మహోగ్ర రూపాన్ని దాల్చుతుంది. మల్లేశ్వర స్వామి ఆలయాన్ని ముంచెత్తే విధంగా గంగాదేవి ప్రవహిస్తుంది. గ్రహించిన మహాశివుడు గంగాదేవిని శాంతించే ప్రయత్నం చేస్తాడు. అయినా శాంతించకపోవడంతో నీటి ప్రవాహాన్ని పక్కకు మళ్లిస్తాడు. దీంతో ఈ ప్రాంతంలో గుండం ఏర్పడుతుంది. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో వెలసిన మల్లేశ్వరస్వామి మద్దుండాల మల్లేశ్వరస్వామిగా భక్తులచే కొలువబడుచున్నాడు. ఈ గుండంలో ఝరిస్నానాలు ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది.

మహాశివరాత్రి ఉత్సవాలకు సిద్ధం

అడవిపల్లె సమీపంలో మద్దుండాల మల్లేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా నిర్వాహకులు జ్యోతుల మురళీ నాయుడు మాట్లాడుతూ ఈ నెల 26 బుధవారం ఉదయం స్వామివారికి అభిషేకం, అలంకరణ, పూజా కార్యక్రమాలు, సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల ఊరేగింపు, రాత్రి జాగారం ఉంటుందని చెప్పారు. 27న గురువారం ఝరిస్నానాలు, సిద్ధపూజ, మొక్కుబడులు, వరపడుట, నాజెలు, దేవరెద్దులు, భజనలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. రాత్రి భక్తుల కాలక్షేపానికి వెంకటేశ్వరనాట్య కళామండలిచే ద్రౌపది మానసంరక్షణ వీధి నాటకం ఉంటుందని చెప్పారు. రెండు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పీలేరు నుంచి మద్దుండాల మల్లేశ్వరస్వామి ఆలయం వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య సామిల్లుతో ఇబ్బందులు

- సబ్ కలెక్టర్‌కు మొరపెట్టుకున్న సైదాపేట వాసులు
- రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదులు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఏఓ రాఘవేంద్ర

మదనపల్లె : పట్టణంలోని సైదాపేటలో ఇళ్ల మధ్య ఉన్నటువంటి సామిల్లుతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, 80 ఏళ్ల వృద్ధుడు షేక్ చాంద్ పాషా సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాలకు సంబంధించి ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సబ్ కలెక్టరేట్ డీఏఓ రాఘవేంద్ర ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సైదాపేటకు చెందిన షేక్ చాంద్‌పాషా, తమ వీధిలో మహబూబ్‌బాషా నిర్వహిస్తున్న సామిల్లు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నడుపుతుండటంతో దుమ్ము, ధూళితో పాటుగా శబ్దకాలుష్యం అధికంగా ఉందన్నారు. వీధుల్లో నివసించేవారు సామిల్లు కారణంగా అనారోగ్యాల పాలవడమే కాకుండా పిల్లలు చదువుకునేందుకు వీలులేక నరకయాతన అనుభవిస్తున్నామన్నారు. సామిల్లును బదిలీచేయాలని మున్సిపాలిటీలో జరిగే గ్రీవెన్స్‌లో రెండుసార్లు ఫిర్యాదుచేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. అలాగే తండ్రి ఆస్తిని ముగ్గురు కొడుకులకు సమభాగాలు దక్కేలా చూడాలని మదనపల్లె పట్టణం ఎన్వీఆర్ వీధికి చెందిన సౌకత్‌అలీ అర్జీ సమర్పించారు. కురబలకోట మండలం ముదివేడు గ్రామంలో తమ తండ్రి సయ్యద్ హుస్సేన్ పేరుమీద ఉన్న ఆస్తికి ఒక కొడుకు పాసుపుస్తకాలు చేసుకుని అనుభవిస్తున్నాడని, మిగిలిన ఇద్దరం ఎలాంటి పత్రాలు లేకుండా ఉన్నామని, ఆస్తిని ముగ్గురికి సమభాగాలు వచ్చేలా చూడాలన్నారు. కురబలకోట మండలం శింగన్నగారిపల్లెలో నివసిస్తున్న తమకు బి.కొత్తకోట మండలం కోటావూరు గ్రామపంచాయతీలో సర్వేనెం.505–1లోని 4.75 ఎకరాల భూమి తాత ముత్తాతల కాలం నుంచి తమ అనుభవంలో ఉందన్నారు. ఈ భూమిని గుర్రప్ప, అతడి కుమారుడు కబ్జాచేసి, అక్రమంగా తమపేరు మాద పాసుపుస్తకాలు చేసుకున్నారని, వాటిని రద్దు చేసి తమకు న్యాయం చేయాల్సిందిగా వేడుకున్నారు. పాసుపుస్తకాల కోసం ఐదేళ్లుగా తిరుగుతున్నప్పటికీ, రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని బి.కొత్తకోట మండలం సూరప్పవారిపల్లెకు చెందిన బండి వెంకటలక్ష్మమ్మ అర్జీ సమర్పించింది. బడికాయలపల్లె గ్రామంలో బండి వెంకటరమణ ద్వారా అగ్రిమెంటు రూపంలో పొందిన భూమికి పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరుచేయాల్సిందిగా వినతిచేశారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన డీఏఓ రాఘవేంద్ర, వాటిని పరిష్కార నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

ఘనంగా మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ట



మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

రామసముద్రం : మండలంలోని మానేవారిపల్లి గ్రామ పంచాయతీ, మానేవారిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మదనపల్లి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త నిసార్ అహమ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయి తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. వారికి గ్రామస్తులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు వారికి అర్చనలు చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు భక్తిభావంతో ఆలయ నిర్మాణాలు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ రామచంద్రారెడ్డి, టెలికామ్ సభ్యులు కరీముల్లా, మండల కన్వీనర్ కేశవరెడ్డి, వైస్ ఎంపీపీ రమణారెడ్డి, అరికెల జయరామిరెడ్డి, తిమ్మారెడ్డి, బుడ్డారెడ్డి, రత్నారెడ్డి, సర్పంచ్ బాలప్ప, సుబ్బారెడ్డి, రమణారెడ్డి, రెడ్డివీరే గౌడ్, ఈశ్వర్, బాలాజీ, తిమ్మయ్య, శంకరప్ప పాల్గొన్నారు.

రెడ్ బుక్ రాజ్యాంగం మానుకోవాలి

– మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



వైఎస్సార్‌సీపీ నాయకులతో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : రాష్ట్రంలో ఇకనైనా రెడ్‌బుక్ రాజ్యాంగం మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు గుర్రం మహేశ్వర్‌రెడ్డి నూతన గృహప్రవేశానికి హాజరయ్యారు. రామానాయక్ తాండాకు చెందిన బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని యమున రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పీలేరు పట్టణం మల్లెల గ్రౌండ్‌కు చెందిన మల్లె జాఫార్ సాహెబ్ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాలంవారిపల్లె మొరవపల్లెలో ఇటీవల మరణించిన వీఆర్వో చలపతి కుటుంబాన్ని పరామర్శించారు. అగ్రహారంలో వైఎస్సార్ సీపీ నాయలకులు, కార్యకర్తలతో మాట్లాడి పార్టీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పాలంటే వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా అవసరమన్నారు. అయితే అసెంబ్లీకి రాకుండా అడ్డుపడే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎక్కడాలేని విధంగా మన రాష్ట్రంలో కొన్ని మీడియా చానళ్లపై నిషేధం విధించడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. కార్యక్రమంలో దండు జగన్‌మోహన్‌రెడ్డి, హబీబ్‌బాషా, భాస్కర్‌రెడ్డి, అమరనాథరెడ్డి, పి. ద్వారకనాథరెడ్డి, ఎన్.వి. చలపతి, చక్రధర్, మునీర్, షబ్బీర్, ఆబిద్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో డాక్టర్లను నియమించండి సారూ..!

– జిల్లా కలెక్టర్‌కు బహుజన యువసేన వినతి



కలెక్టర్‌కు జిల్లా ఆస్పత్రిలో వైద్యుల కొరతపై వివరిస్తున్న బహుజన యువసేన పునీత్‌కుమార్

మదనపల్లె : మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో నేడు కీలకవిభాగాలకు వైద్యులు లేక ప్రజలు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి దాపురించింది. పెద్దాసుపత్రిలో డాక్టర్లను నియమించాలని బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షులు పునీత్‌కుమార్ సోమవారం రాయచోటిలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ శ్రీధర్ చామకూరికి కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పునీత్‌కుమార్ మాట్లాడుతూ...మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలో గతంలో ఏపీ వైద్యవిధానపరిషత్ కింద ఉన్నటువంటి 24మంది రెగ్యులర్ సీనియర్ డాక్టర్లను, బోధనాసుపత్రిగా మార్చాక, ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోకి వస్తుందని బదిలీ చేశారన్నారు. తర్వాత డీఎంఈ పరిధిలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డాక్టర్ల ద్వారా వైద్యచికిత్సలు అందిస్తూ వచ్చారన్నారు. మెడికల్ కాలేజీకి అనుమతులు రాకపోవడంతో... రెండునెలల క్రితం మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి డీఎంఈ హోదా తీసివేయడం జరిగిందన్నారు. దీంతో ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందిని, ఇతర బోధనాసుత్రిలకు బదిలీ చేశారన్నారు. దీంతో గతంలో పనిచేసిన డాక్టర్లు లేక, బోధనాసుపత్రి వైద్యులు లేక జిల్లా ఆస్పత్రి వెలవెలపోతోందన్నారు. ప్రస్తుతం జిల్లా ఆస్పత్రిలో చిన్నపాటి జలుబు, దగ్గు, జ్వరాలకు తప్ప ఇతర వ్యాధులకు చికిత్సలు అందించేందుకు వైద్యులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పేదరోగుల పాలిట సంజీవనిగా ఉన్నటువంటి జిల్లా ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులను నియమించి ప్రజలకు భరోసా కల్పించాల్సిందిగా కోరామన్నారు.

ఉపాధి పనులపై సామాజిక బహిరంగ సభ

కలకడ : మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామీ పథకం పనులకు సామాజిక తనిఖీ నిర్వహించారు. మండలంలోని 16 పంచాయతీలలో జరిగిన అక్రమాలపై సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అబ్దుల్‌రహీం అధ్యక్షతన నిర్వహించిన సామాజిక బహిరంగ సభలో వెల్లడించారు. సోషియల్ అడిట్ సిఆర్‌పి సుబ్బారావు బృందం మండలంలోని 16 పంచాయతీలలో రూ.7.47కోట్లు ఖర్చు చేసి చేపట్టిన 486 పనులను తనిఖీ చేసి నివేదికలు అందించారు. గతంలో సామాజిక తనిఖీలో అనేక అక్రమాలు బయటపేడి అయితే ఈ ఏడాది మాత్రం కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు రూ.7.47కోట్లు పనులకు కదిరాయచెర్వు, కె.బాటవారిపల్లె, రాతిగుంటపల్లె, కోన, నవాబుపేట పంచాయతీలలో కేవలం రూ.8,369 మాత్రం రికవరీకి ఆదేశించారు. అక్రమాల జాబితా లేదు, సిబ్బందిపై చర్యలు లేవు. ఒక్క బాలయ్యగారిపల్లె పంచాయతీలో మాత్రం రూ.42,128 ఇంకుడుగుంతల నిర్మాణంలో తేడాలు ఉన్నట్లు గుర్తించడంతో వాటిని క్షుణ్ణంగా విచారించి తిరిగి పరిశీలించి నివేదికలు అందివాలని పంచాయతీరాజ్ డీఈని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మినరసింహా, ఎంపీడీఓ అబ్దుల్‌రహీం, సెర్ప్ సిహెచ్ సుబ్బారావు, ఏఈ నాగమునినాయక్, ఏపీఓ చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత ఆశయంతో చదవాలి

తంబళ్లపల్లె: విద్యార్థులు ఉన్నత ఆశయంతో చదివి కీర్తిప్రతిష్టలు తేవాలని ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్ కోరారు. సోమవారం స్థానిక మోడల్‌స్కూల్‌లో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం, పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరిగింది. అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు క్రమశిక్షణ, పట్టుదలనే ఆయుపట్టున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ వాణిశ్రీ, ఎంఈఓ నాగసుబ్బరాయుడు, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హంసవాహనంపై సిద్దేశ్వరస్వామి



కలకడ : మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి కలకడ శ్రీకామాక్షి సిద్దేశ్వర స్వామిని వడ్డెర కులస్తులు ఏర్పాటు చేసిన హంస వాహనంపై కలకడ పురవీధులలో ఊరేగించారు. ఇంటింటి పూజలు అందుకున్న స్వామివారు సోమవారం ఉదయం ఆలయ ప్రవేశం చేశారు. స్వామివారి రథం ముందు కోలాటం, చక్కభజన భక్తులను ఆకట్టుకున్నాయి.

ఉన్నత లక్ష్యం నిర్దేశించుకోవాలి

పీలేరురూరల్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి, హెచ్‌ఎం సురేంద్రనాథరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మెయిన్ జెడ్పీ హై స్కూల్ పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు.

వైఎస్సార్ సీపీలో బీసీలకు సముచిత స్థానం

– పార్టీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్



నిసార్‌అహ్మద్‌ను సన్మానిస్తున్న రామసముద్రం మండల నాయకులు

మదనపల్లె : స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల తర్వాత బీసీలకు సముచిత స్థానం, గౌరవం, ప్రాధాన్యత కల్పించిన ఏకైక నాయకుడు...మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్.జగన్ అని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ తెలిపారు. వైఎస్సార్ సీపీలో కీలకపదవులు దక్కించుకున్న రామసముద్రం మండల నాయకులు సోమవారం నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేనంతగా బీసీల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటుగా, నామినేటెడ్ పదవుల కేటాయింపుల్లోనూ పెద్ద పీట వేసిన ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రామసముద్రం మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ గెవన్న, జిల్లా ఉపాధ్యక్షులు సీహెచ్.రామచంద్రారెడ్డి, మండల కన్వీనర్ కేశవరెడ్డి, నియోజకవర్గ బీసీసెల్ ప్రెసిడెంట్ దొడ్డిపల్లె ఆనంద్, దివ్యాంగుల విభాగం గిరిబాబు సారథ్యంలో వైఎస్సార్ సీపీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పూర్వవైభవం తెచ్చేందుకు ఇప్పటి నుంచే కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పదవులు పొందిన నాయకులు వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేషకుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రామసముద్రం మండల వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై అక్రమ నిర్మాణాలు



టోల్‌గేటు దాటుకొని కొండపైకి ట్రాక్టర్‌లో తరలిస్తున్న నిర్మాణ సామగ్రి

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నట్టు తెలుస్తోంది. నూతన జిల్లా ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వంలో కొండపై అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపారు. చిన్న విషయమైనా అధికారులు స్పందించి సత్వర చర్యలు చేపట్టి అక్రమాల నిగ్గుతేల్చారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనుచూపమేరలో కనిపించడం లేదు. కొండపై పరిస్థితులు మళ్లీ మొదటికి వచ్చాయి. కొన్నిరోజులు కొండపై ఉత్తర భాగంలో అక్రమ నిర్మాణాలు రహస్యంగా సాగిస్తున్నట్టు తెలిసింది. దీనికి అవసరమైన నిర్మాణ సామగ్రి పైకి వెళ్లాలంటే మదనపల్లె సబ్ కలెక్టర్ అనుమతి ఉంటే తప్ప పంపేవారు కాదు. ప్రస్తుతం అనుమతితో పనిలేకుండా నిర్మాణ సామగ్రి పైకి పంపేస్తున్నారు. ప్రస్తుతం టోల్ వసూలు చేస్తున్నది రెవెన్యూ సిబ్బందే కావడంతో వీరు మరింత కఠినంగా చర్యలు తీసుకోవచ్చు. అయితే దీన్ని పట్టించుకోకుండా సామగ్రిని పైకి తరలించుకునేందుకు అడ్డు చెప్పకుండా వదిలేస్తున్నందున పనులు సాగిపోతున్నాయి. కొండపై చిన్న నిర్మాణం జరగాలన్నా సబ్‌కలెక్టర్ అనుమతి అవసరం. ఇప్పుడు దీన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. అంతా మా ఇష్టమే అన్నట్టుగా కొండపై వ్యవహారాలు సాగిపోతున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు నిర్మాణ సామాగ్రి పైకి వెళ్లకుండా నిరోధిస్తే అక్రమ నిర్మాణాలు జరగకుండా అడ్డుకోవచ్చు.

మదనపల్లెలో ఎడిఫై కిడ్ క్యాంపస్



కిడ్స్ క్యాంపస్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్, డైరెక్టర్

మదనపల్లె : పట్టణాల్లో విశేష ప్రజాదరణ పొందిన ఎడిఫై స్కూల్‌ను మదనపల్లె విద్యార్థుల కోసం అందుబాటులోకి తెస్తున్నట్లు పాఠశాల డైరెక్టర్ ఘర్ అగర్వాల్ తెలిపారు. పట్టణంలోని సాయిచిత్ర థియేటర్ వెనుకవేపు గుర్రం పెద్దప్పనాయుడువీధిలో ఏర్పాటు చేసిన ఎడిఫై కిడ్స్ క్యాంపస్‌ను ఆదివారం ప్రారంభించారు. చైర్మన్ రమేష్‌నాయుడు, హెడ్ ఆఫ్ ది ఇన్‌స్టిట్యూషన్ సుష్మానాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అమృత హాస్పిటల్ డాక్టర్.ఎం.గోపీకృష్ణ, బీటీ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్.తులసీరామ్‌నాయుడు, ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...అన్నమయ్యజిల్లాలో ఎడ్యుకేషన్ హబ్‌గా పేరొందిన మదనపల్లెలో ఎడిఫై స్కూల్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలలో 27 మంది ఎంపిక

మదనపల్లె సిటీ: స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం టీవీఎస్ సుందరమ్ కంపెనీ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. వివిధ విభాగాల నుంచి 27 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వారికి వార్షిక వేతనం రూ.3 లక్షలు ఇవ్వబడుతుందని కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ సయ్యద్ హుస్సేన్ తెలిపారు. కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ కాలేజీలో పలు కంపెనీలు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సతీష్‌బాబు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

– డ్వామా పీడీ వెంకటరత్నం



ఉపాధి హామీ పనులు తనిఖీ చేస్తున్న పీడీ వెంకటరత్నం

పీలేరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 150 రోజుల పని దినాలు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ వెంకటరత్నం అన్నారు. సోమవారం మండలంలోని ముదుపులవేముల పంచాయతీ కుమ్మరపల్లె వద్ద ఉపాధి హామీలో ఫాంపాండ్ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఫాంపాండ్ పనులు చేసుకోవడం వల్ల నీటినిల్వ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలాగే స్థానికులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో అశోక్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో జ్ఞానజ్యోతి

మదనపల్లె : నూతన విద్యావిధానం అమలులో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు జ్ఞానజ్యోతి పేరిట ప్రత్యేక శిక్షణను అందించడం జరుగుతోందని ఐసీడీయస్ సీడీపీఓ సుజాత అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో రెండోవిడత జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రీ స్కూల్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సుజాత మాట్లాడుతూ.. వచ్చే ఏడాది నుంచి విద్యావిధానంలో పలుమార్పులను రాష్ట్రప్రభుత్వం తీసుకురానున్న నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై శిక్షణ కార్యక్రమంలో నేర్పడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు దశలవారీగా 120 రోజుల పాటు వివిధ అంశాలపై తర్ఫీదు ఇచ్చేలా కార్యక్రమాలను రూపొందించామన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేఆర్‌పీ రవీంద్రనాథ్, డీఆర్పీలు కే.చంద్రకాంత, రమణమ్మ, ఉపాధ్యాయులు కరుణాకర్, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ములకలచెరువు: మండలంలోని రామాపురం శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే శివరాత్రి వేడుకలకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆర్థిక సహాయం అందించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు రూ.25 వేలు అందజేయగా సొమ్మును వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలయ నిర్వాహకులకు సోమవారం అందజేశారు.

నేటి నుంచి మస్తాన్‌వల్లి దర్గా ఉరుసు

మదనపల్లె సిటీ: స్థానిక కోటవీధిలోని మస్తాన్ వల్లి దర్గా ఉరుసు ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయనిదర్గా కమిటీ అధ్యక్షులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, కార్యదర్శి యూసఫ్ షరీఫ్, కోశాధికారి ప్యారీజాన్ తెలిపారు. మంగళవారం గంధం, బుధవారం ఉరుసు, గురువారం తహలీల్ ఫాతెహా నిర్వహించనున్నట్లు తెలిపారు. హిందూ, ముస్లిం సోదరులు ఉరుసు ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సీనియర్ సిటిజెన్స్ సమస్యలు పరిష్కరించాలి

మదనపల్లె సిటీ: సీనియర్ సిటిజెన్స్ సమస్యలు పరిష్కరించాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎన్.మునిగోపాలకృష్ణ సీనియర్ సిటిజెన్స్ జాతీయ అధ్యక్షులు వి.కె.బదానికి వినతిపత్రం అందజేశారు. రాజస్థాన్ రాష్ట్రం ఉదయపూర్‌లో జరిగిన సీనియర్ సిటిజెన్స్ జాతీయసభలో పాల్గొన్నారు. సీనియర్ సిటిజెన్స్‌కు రైల్వేలో రాయితీ పాసులు కొనసాగించాలన్నారు.ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో వయోవృద్ధులపైన దాడులు పెరుగుతున్నాయని, దీనిపై ప్రత్యేక చొరవ తీసుకుని దాడులు అరికట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. 2002 చట్టం సక్రమంగా అమలు చేయాలన్నారు. సమస్యలు పరిష్కారానికి చొరవ చూపుతానని హామీ ఇచ్చారని తెలిపారు.

సీపీఐ నాయకుడి మృతికి సంతాపం

బి.కొత్తకోట: స్థానిక బీసీకాలనీకి చెందిన సీపీఐ నాయకుడు వెంకటేష్ (59) మృతికి ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నరసింహులు సంతాపం తెలిపారు. సోమవారం నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప తదితరులతో మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. పార్టీ అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. వెంకటేష్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

తాళిబొట్టు వితరణ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ వారు నిరుపేదల పెళ్లిళ్లకు వారి వంతు సాయం చేస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని టి.సదుం పంచాయతీ రామాపురంకు చెందిన మునీంద్ర, లావణ్య దంపతులకు ఫౌండేషన్ సభ్యులు రమణ, చిన్ని, రెడ్డిబాషాలు బంగారు తాళిబొట్టును అందజేసి ఆశీర్వదించినట్లు అధ్యక్షుడు రాజశేఖర్ సోమవారం పేర్కొన్నారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎంపీపీ మహమూద్

పెద్దతిప్పసముద్రం: స్థానిక బస్టాండ్‌లోని తెలుగు ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంపీపీ మహమూద్ అకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, మధ్యాహ్న భోజనం అమలు, మౌలిక వసతులపై హెచ్‌ఎం శంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలకు వెనుక వైపున ప్రహరీ లేనందున మందుబాబులు, ఆకతాయిల వచ్చి ఆవరణం అంతా అపరిశుభ్రం చేసేస్తున్నారని తెలిపారు. సమస్యపై స్పందించిన ఎంపీపీ అధికారులతో మాట్లాడి ప్రహరీ మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

బి.కొత్తకోట: మండలంలోని గోళ్లపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి నుంచి రూ.999 విలువైన మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసామని ఏఎస్ఐ బొజ్జినాయక్ సోమవారం తెలిపారు. ఈ.నరేంద్ర అనే వ్యక్తి ఓ మద్యం దుకాణం నుంచి కొనుగోలు చేసిన మద్యాన్ని విక్రయిస్తున్నట్టు అందిన సమాచారంతో దాడులు నిర్వహించినట్టు తెలిపారు. రూ.99 విలువ కలిగిన 180ఎంఎల్ బాటిళ్లు పది స్వాధీనం చేసుకుని నిందితునిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శివలింగానికి పంచామృతాభిషేకం

పెద్దతిప్పసముద్రం: స్థానిక శివాలయంలో సోమవారం శివలింగానికి పంచామృతాభిషేకం ,అన్నాభిషేకం, రుద్రహోమం నిర్వహించారు. అన్నాభిషేకం, అన్న ప్రసాద వితరణకు వెంకట్రమణ గుప్తా, గాయత్రి దంపతులు, అన్న ప్రసాదానికి తోట సిద్దప్ప కుటుంబీకులు సహకరించినట్లు ఆలయ సేవకులు సనగరం పట్టాభిరామయ్య తెలిపారు.